నేరెళ్ల శారదను కలిసిన గౌడ సంఘం నాయకులు

నేరెళ్ల శారదతో గౌడ సంఘం నేతలు

తెలంగాణచౌక్,జూలై17: రాష్ట్ర మ హిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారదను సర్వాయిపాపన్న గీతా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరు పరుశారాం గౌడ్, జిల్లా అధ్యక్షుడు ముత్యాల శంకర్ గౌడ్, నాయకులు సతీశ్‌గౌడ్, మాసగొని సంజీవ్‌గౌడ్ హైదరాబాద్‌లోనిఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి పారాయణం

కోరుట్ల, జూలై 17:స్థానిక సాయి రామ ఆలయంలో వ్యాస గురుపౌర్ణమిని సందర్భంగా గురువారం నుంచి వేడుకలు నిర్వహించనున్నట్లు సీఈవో కాంతారెడ్డి బుధవారం తెలిపారు. యజ్ఞంలో పాల్గొనేందుకు భక్తులు పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

ఘనంగా తొలి ఏకాదశి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- స్వామివార్లను దర్శించుకొని మొక్కుల చెల్లింపు

కమాన్‌చౌరస్తా: నగరంలోని మార్కెట్ ఏరియా వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్లో భక్తులు

కమాన్‌చౌరస్తా/హుజూరాబాద్‌రూరల్/ సైదాపూర్/ వీణవంక/ శంకరపట్నం/ చిగురుమామిడి జూలై 17: కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నాయి. బుధవారం తెల్లవారుజామునుంచే ఆలయాలకు భక్తులతో కిటకిటలాడాయి. బారులు తీరి స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. నగరంలోని మార్కెట్ ఏరియాలోని వేంకటేశ్వరస్వామివారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. గ్రామాల్లో దుర్గమ్మ, పోశమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ వేంకటేశ్వర స్వామి, తుమ్మనపల్లి పంచముఖ ఆంజనేయస్వామి, కందుగుల, చెల్పూర్ తదితర గ్రామాల్లోని వేంకటేశ్వరస్వాముల ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. మానకొండూర్ వేంకటేశుడి సన్నిధిలో భక్తులు పోటెత్తారు. అభిషేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. కేశవపట్నం హనుమాన్ ఆలయంలో అర్చకుడు వెంకటేశ్వరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తణుకు ఓంకారం ఆధ్వర్యంలో ఉదయం గీతా పారాయణం చేశారు. చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి, నవాబ్ పేట్, సుందరగిరి, ఇందుర్తి, రామంచ గ్రామాల్లోని ఆలయాల్లో తెల్లవారుజామునుంచే భక్తుల రద్దీ నెలకొన్నది. అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామివార్లకు మొక్కులు సమర్పించారు.

జిల్లాలో 36,913 మందికి రుణమాఫీ

కరీంనగర్, జూలై 17 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ జిల్లాలో మొదటి విడతలో 36,913 మందికి సుమారు రూ. 360 కోట్ల వరకు రుణమాఫీ అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అర్హులైన రైతులు సుమారు 90 వేల వరకు ఉండగా మొదటి విడతలో రూ. లక్ష లోపు పంట రుణాలు పొందిన రైతులకు గురువారం సాయంత్రంలోగా ఖాతాల్లో మాఫీ నగదు జమచేయనున్నామని పేర్కొన్నారు. ఇందులో కరీంనగర్ రూరల్ మండలంలో 1,896, కొత్తపల్లిలో 640, చొప్పదండిలో 2,948, గంగాధర 2,587, రామడుగు 2,959, ఇల్లందకుంట 1,864, హుజూరాబాద్ 2,573, జమ్మికుంట 2,145, సైదాపూర్ 2,835, వీణవంక 3,085, చిగురుమామిడి 2,557, గన్నేరువరం 1,164, మానకొండూర్ 4,865, శంకరపట్నం 2,735, తిమ్మాపూర్ 2,060 మంది రైతులకు రుణ విముక్తి లభించనున్నది.

కరీంనగర్ రూరల్: జూలై 17: కరీంనగర్ మండంలోని దుర్శేడ్, చామనపల్లి,నగునూర్, మొగ్దుంపూర్ క్లస్టర్లలోని గ్రామాల్లోని 1896 మంది రైతులకు రూ. లక్ష రుణమాఫీ జరగనున్నదని వ్యవసాయ అధికారులు ప్రకటించారు. చామనపల్లి క్లస్టర్‌లో 625 మంది, దుర్శేడ్‌లో 540, మొగ్దుంపూర్‌లో 471, నగునూర్‌లో 262 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ నగదు జమ కానున్నదని వెల్లడించారు.

నేడు రైతు వేదికలో రుణమాఫీ సంబురాలు

కరీంనగర్‌రూరల్: జూలై 17: రుణామాఫీ అమలు నేపథ్యంలో రైతు వేదికల్లో గురువారం రుణమాఫీ లబ్ధిదారులతో సంబురాలు నిర్వహించనున్నామని వ్యవసాయ అధికారి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ మండల రైతు లు చామనపల్లి రైతు వేదికలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్ వీసీ ద్వారా రైతులతో మాట్లాడాతారని వెల్లడించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వీణవంక, జూలై 17: ఈ నెల 16న రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న మడిపల్లి మొగిలయ్య (68) బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ తోట తిరుపతి వివరాల ప్రకారం.. మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన మొగిలయ్య ఈ నెల 16న శ్రీరాములపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా నర్సింహులపల్లికి చెందిన వంతడుపుల సమ్మయ్య నడుపుతున్న ట్రాక్టర్ వెనుక నుంచి మొగిలయ్యను ఢీకొన్నది. వెంటనే హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు .మృతుడి కుమారుడు మడిపెల్లి నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

సారంగాపూర్, జూలై 17: బీర్‌పూర్ మండలం మంగెళ పంచాయతీ పరిధిలోని గొండుగూడెం గ్రామానికి చెందిన దివ్వ అనూష్ (7) కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. అనూష్ మంగళవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేయడంతో తల, చెవి, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

మల్యాల, జూలై 17:మండలంలోని ముత్యంపేట శివారులోని పొలంలో పడి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేటకు చెందిన మల్యాల గంగాధర్ (40) బుధవారం గ్రామానికి చెందిన కొంతమందితో కలిసి విందు చేసుకున్నాడు. ఈ క్రమంలో బహిర్భుమికి వెళ్లిన గంగాధర్ విందు చేసుకున్న సమీప ప్రాంతంలోని ఓ పొలంలో పడి మృతి చెందాడు. ఘటనా స్థలానికి ఎస్ఐ నరేశ్ వెళ్లి పరిశీలించారు. గంగాధర్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మేడిపల్లి, జూలై 17: భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మరిపేటకు చెందిన తీపిరి శ్రావణి అలియాస్ మాలతి(25) కొడుకు సహర్ష మంగళవారం కడుపునొప్పితో బాధపడగా, చికిత్స కోసం డాక్టర్ వద్దకు తీసుకెళ్లే విషయంలో భర్తతో గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మాలతి గడ్డి మందు తాగింది. దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మాలతి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఏకకాలంలో పంట రుణమాఫీ చేయాలి

మేడిపల్లి, జూలై 17: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రైతులకు రెండు లక్షల పంట రుణమాఫీ చేయాలని రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు నోముల నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరుమల్ల గ్రామంలో రెడ్డి సంఘం కార్యవర్గ సభ్యులు, రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకువచ్చిన కండీషన్‌తో కూడిన జీవోతో రైతులు అయోమయానికి గురవుతున్నారన్నారు. రైతులు సురకంటి అంజిరెడ్డి, కందరి శ్రీధర్‌రెడ్డి, కాలగిరి రాజేందర్, ప్రణయ్ ఉన్నారు.

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణచౌక్‌లో ఏకలవ్య జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సంఘం నాయకులు

తెలంగాణచౌక్,జూలై 17: సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుబడిన ఎరుకుల కులస్తుల అభివృద్ధి కోసం ఏకలవ్య పేరిట ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎరుకుల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి డిమాండ్ చేశారు. నగరంలోని తెలంగాణచౌక్‌లో ఏకలవ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకుల కులస్తుల ఆరాధ్యుడైన ఏకలవ్యుడి జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కుల సంఘాల బాధ్యులకు రుణాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, తిరుపతి, సతీశ్, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

పంట రుణమాఫీకి షరతులు ఎత్తేయాలి

తెలంగాణచౌక్,జూలై 17: పంట రుణమాఫీ కోసం ప్రభుత్వం విధించిన షరతులను ఎత్తేసి అర్హులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ ఆఫీసు ముకుందలాల్ మిశ్రా భవన్‌లో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీకి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడం సరికాదన్నారు. ఎన్నికల హామీ మేరకు పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వా నికి రైతుల మీద చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. అధికారంలో రాక ముందు సీఎంరేవంత్‌రెడ్డి చేసిన హామీలు ఇప్పుడు ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. రుణమాఫీ కోసం రూపొందించిన జీవో 567 ను సవరించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీలో అర్హులైన రైతులకు అన్యాయం జరిగితే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకల్లో ఘర్షణ

కొడిమ్యాల, జూలై 17: మండల కేంద్రంలో బుధవారం మొహర్రం వేడుకల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది. అంగడీ బజార్‌లో నిర్వహిస్తున్న వేడుకల్లో పీరీలు, వివిధ వేషధారణలో ఉన్న యువకులు ఒకేసారి చౌరస్తా వద్దకు చేరుకున్నారు. జనసందోహం ఎక్కువ కాడడంతో వివిధ వేషధారణలో ఉన్న యువకులు ఒక్కసారి కేకలు వేస్తు సందడి చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సందీప్ సిబ్బందితో వచ్చి చెదరగొట్టాడు.

పీరీల పండుగ..మత సామరస్యానికి ప్రతీక

రామడుగు: గుండిలో పీరీలకు దట్టి కడుతున్న వీర్ల వెంకటేశ్వరరావు

రామడుగు, జులై17: పీరీల పండుగ హిందూ, ముస్లింల మత ప్రతీకని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు అభివర్ణించారు. మండలంలోని గుండిలో ప్రతిష్ఠించిన పీరీలను బుధవారం సందర్శించారు. దట్టిలు కట్టి, కుడకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. కులమతాలకతీతంగా పండుగను జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. కాగా, బుధవారం సాయంత్రం డప్పుచప్పుళ్ల మధ్య పీరీలను ఊరేగించారు. అనంతరం సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు సో హైల్, కనుకయ్య, పంజాల శ్రవణ్, గుమ్మడి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా భక్తిశ్రద్ధలతో..

శంకరపట్నం, జూలై 17: మండలంలోని మొలంగూర్, రాజాపూర్, తాడికల్, కరీంపేట్, ఆముదాలపల్లి, కేశవపట్నం, తదితర గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు (పీర్ల పండుగ)ను జరుపుకున్నారు. హసన్, హుస్సేన్‌ల వీరోచిత త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ఊదు వేసి పీరీలను వీధుల్లో ఊరేగించారు. మొలంగూర్‌లో పెద్దసంఖ్యలో యువకులు తరలివచ్చారు. దస్తీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

సైదాపూర్, జూలై17: మండలకేంద్రంతో పాటు వెంకటేశ్వర్లపల్లి, జాగీర్‌పల్లి, ఆకునూర్, శివరాంపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం పండగను ఘనంగా జరుపుకున్నారు. డప్పు చప్పుళ్ల మధ్య పీరీలను ఊరేగించారు. భక్తులు దట్టీలు, కుడుకలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీరీలను సమీపంలోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు.

కరీంనగర్‌రూరల్: జూలై 17: కరీంనగర్ మండంలోని బొమ్మకల్, చేగుర్తి, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్, ఫకీర్‌పేట, నగునూర్, తీగలగుట్టపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీరీలను ఊరేగించి సమీపంలోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. చెర్లభూత్కూర్‌లో అక్బర్, దుర్గయ్య, న్యాతరి శ్రీను ఉన్నారు.

శంకరపట్నం: మొలంగూర్‌లో పీరీల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

OLD AGE HOME

★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.

NT-325763-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎస్సార్ రైస్‌మిల్లులో అధికారుల తనిఖీలు

మిల్లులో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ అధికారులు

హుజూరాబాద్ రూరల్, జూలై 17: మండలంలోని రంగాపూర్‌లోని ఎస్సార్ రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యంలో 14805.52 క్వింటాళ్ల వ్యత్యాసం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రభుత్వం సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని సదరు రైస్‌మిల్లు యాజమాని పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించారు. కాగా, చెల్లించాల్సిన ధాన్యానికి డబ్బులు లేదా ధాన్యం ఇస్తామని లిఖితపూర్వకంగా ఎస్సార్ ట్రేడర్స్ రైస్ మిల్ యాజమాని బొబ్బల రాజిరెడ్డి అధికారులకు రాసి ఇవ్వడంతో అధికారులు కొంత గడువు ఇచ్చినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయ్ పెద్దపల్లి డీఎం శ్రీకాంత్‌రెడ్డి, హుజూరాబాద్ తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీసీఎస్ వసంతరావు, ఎఫ్ఐ వినోద్ తదితరులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థికి ఘన సన్మానం

హర్షవర్ధన్, తల్లితండ్రులను సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ విజయలక్ష్మీచందు

చొప్పదండి, జులై17: బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన భూపాలపట్నం గ్రామానికి చెందిన రిటైర్డ్ జవాన్ శనిగరం వెంకటేశ్, మంగ దంపతుల కుమారుడు హర్షవర్ధన్‌ను బుధవారం మాజీ వైస్ ఎంపీపీ మునిగాల విజయలక్ష్మీచందు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హర్షవర్ధన్ గొప్పగా చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇందులో గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

మహిళా అడ్వకేట్ గీతకు ఘన సన్మానం

గీతను సన్మానిస్తున్న శ్రీసప్తగిరి లయన్స్ క్లబ్ బాధ్యులు

విద్యానగర్, జూలై 17: అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సప్తగిరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అడ్వొకేట్ రామిడి గీతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ గునుకుల సత్యనారాయణ రెడ్డి, జోనల్ చైర్మన్ గడప కోటేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్' పనుల్లో అవినీతి లేదని ప్రమాణం చేస్తావా?

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాంనగర్, జూలై 17: స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరగలేదని చెబుతున్న మేయర్ సునీల్‌రావు మహాశక్తి టెంపుల్‌లో ప్రమాణం చేసేందుకు సిద్ధమా? అని కాంగ్రెస్ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ సవాల్ విసిరారు. కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కిసాన్ నగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో ఇంటిగ్రెటెడ్ మార్కెట్‌లో షెడ్ గద్దెలను తొలగింపు పనుల్లో కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు కలిసి రూ. 80 లక్షలు , గాంధీరోడ్ కూడలిలో మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు పనుల్లో భాగంగా 45 ఫీట్ల బోర్ కేసింగ్ వేసి 150 ఫీట్లు బిల్లు తీసుకున్నారని ఆరోపించారు. గీతాభవన్ జంక్షన్ పనులు.ఆర్ట్స్ కళాశాల (మల్టీపర్పస్ స్కూల్) పార్కు అభివృద్ధి పనుల్లోనూ అక్రమాలకు పాల్పడ్డార న్నారు. అలాంటి నాయకుడు మచ్చలేని మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. మేయర్ అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. స్మార్ట్ సిటీ నిధుల పనులతో విదేశాల్లో ఆస్తులను కూడబెట్టుకున్నది. స్మార్ట్ సిటీ కాంట్రాక్టర్ రూ. 7 కోట్ల విలువైన బంగ్లాను నీకు నిర్మించి ఇచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడిన ఆయన ఇప్పుడు బండి సంజయ్ జపం చేయడం విడ్డూరమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రకాశ్, గంట శ్రీనివాస్, వైద్యుల అంజన్‌కుమార్, ఆకుల నర్సయ్య, కాశిట్టి శ్రీనివాస్, పడిశెట్టి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలి

మానకొండూర్, జూలై 17: క్రీడల్లో గెలుపోటములను క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. బుధవారం మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో నిర్వహించిన క్రికెట్‌టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదా నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలు కావద్దన్నారు. చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

విజేత జట్టుకు ట్రోఫీని బహూకరిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్

పెన్షనర్లకిచ్చిన హామీలను అమలు చేయాలి

కలెక్టరేట్, జూలై 17: అసెంబ్లీ ఎన్నికల్లో రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా పెన్షనర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పెన్షన్ బెనిఫిట్స్ గ్రాట్యుటీ తదితర అంశాలను పొందుపరిచిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా ఈ హామీలను అమల్లో నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. కేవలం ఒకటో తేదీన పెన్షన్ విడుదల చేస్తే సరిపోదని, దీర్ఘకాలంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరించాలని కోరారు. లేదంటే పెన్షనర్లు మూకుమ్మడి నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో పలు మండలాల పెన్షనర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఔదార్యం

అంజయ్య కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి, జులై17: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఔదార్యాన్ని చాటాడు. గల్ఫ్ దేశంలో ఇటీవల మరణించిన భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య అంత్యక్రియల కోసం మేడిపల్లి రూపాదేవి ఫౌండేషన్ తరుపున రూ. 5వేల నగదు వితరణ చేశారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపట్నం కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

గోరు చిక్కుడుకాయ అలంకరణలో అమ్మవారు

కరీంనగర్ రూరల్: జూలై 17: ఆషాడ మాస శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా నగునూరు దుర్గాభవానీ అలయంలో బుధవారం అమ్మవారు గోరు చిక్కుడు కాయ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మాధికారి వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ అమ్మవారికి విశేష హారతులు ఇచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, కమిటీ బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571